సాక్షి నంద్యాల

మంగళవారం ❘ 16 ❘ మే ❘ 2023



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన
శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవను నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.



నిప్పుల కొలిమి
ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడగాలుల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. 10లో▸



ఆ'శక్తి' సన్నగిల్లి..
స్త్రీ, పురుషుల్లో సంతానలేమి సమస్యలు పెరుగుతున్నాయి. నూతన జీవన శైలితో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురికావడమే కారణమని వైద్యులు చెబుతున్నారు. 10లో▸

న్యూస్‌రీల్

పోలీసు స్పందనలో 65 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 65 వినతులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో అధికంగా సివిల్ తగాదాలు, అత్తింటి వేధింపులు, అన్నాదమ్ముళ్ల గొడవలు లాంటి సమస్యలు ఉన్నాయన్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా మరి కొన్ని సమస్యలను ఆయా స్టేషన్ అధికారులకు పంపామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



ఆలయ ప్రధాన క్యూలో భక్తులు

శ్రీశైలంటెంపుల్: శివునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం నేపథ్యంలో శ్రీశైల క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీశైలం చేరుకున్నారు. భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శనార్థం వచ్చిన భక్తులు వేకువజామునే పవిత్ర పాతాళగంగలో పుణ్యస్నానాలాచరించారు. అనంతరం భక్తులు ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలకు చేరుకోవడంతో అన్ని క్యూ కంపార్ట్‌మెంట్లు, క్యూలు కిక్కిరిసిపోయాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు క్యూలలో వేచి ఉన్న భక్తులకు మంచి నీరు, అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు.

ఎయిర్‌క్రాఫ్ట్‌తో భూ రీసర్వే



శ్రీశైలం: శాశ్వత భూహక్కు, భూరక్షలో భాగంగా శ్రీశైల మండలంలోని ప్రాజెక్ట్ కాలనీ, లింగాల గట్టు, శ్రీశైలక్షేత్రం పరిధిలో సోమవారం ఎయిర్‌క్రాఫ్ట్‌తో రీ సర్వే చేపట్టారు. వారం రోజుల క్రితం కూడా ఇదే మండలంలో ఎయిర్‌క్రాఫ్ట్‌తో రీసర్వే చేశారు. అయితే విషయం తెలియకపోవడంతో శ్రీశైల క్షేత్రంపై విమానం చక్కర్లు అంటూ హడావుడి జరిగింది. దీంతో జిల్లా ఉన్నతాధికారులు రీ సర్వే కోసమేనని ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో సోమవారం చేపట్టిన రీ సర్వే విషయాన్ని ముందుగానే జిల్లా అధికారులు స్థానిక తహసీల్దార్ రాజేంద్రసింగ్, సీఐ దివాకర్ రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఎయిర్‌క్రాఫ్ట్ విషయంలో ఎవరూ అపోహలు సృష్టించవద్దని, కేవలం భూసర్వే కోసం జరుగుతుందని వారు స్పష్టం చేశారు.

20న ఏపీఆర్ఎస్ క్యాట్

కర్నూలు(సెంట్రల్): ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఈ నెల 20వ తేదీన ఏపీఆర్ఎస్ క్యాట్-2023ను ఉదయం, మధ్యాహ్నం వేళల్లో నిర్వహించనున్నట్లు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరావు తెలిపారు. సోమవారం తన చాంబరులో వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు ఇంటర్, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటలకు డిగ్రీ కాలేజీల ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు.



వ్యవసాయ పంప్ సెట్ నుంచి పగలే పంటకు నీళ్లు వదులుతున్న దృశ్యం

పవర్ ఫుల్.. రైతు జోష్

- వ్యవసాయానికి పగలే 9 గంటల విద్యుత్ సరఫరా
- లో ఓల్టేజ్ సమస్యకు చెక్
- ఫీడర్ల ఆధునికీకరణ
- అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

పొలాల వద్ద జాగరణ.. బోరు బావుల వద్ద కరెంట్ కోసం పడిగాపులు.. రాత్రి వేళ పొలానికి నీరు కట్టేందుకు వెళ్తూ పాము కాటుతో రైతు మృతి.. గతంలో ఇలాంటి శీర్షికలతో పత్రికల్లో వార్తలు రోజు ఏదో ఒక చోట కనిపించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఎన్నికల ముందు చెప్పినట్లుగానే వ్యవసాయానికి పగలే 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తూ కరెంట్ కష్టాలను తొలగించింది. భవిష్యత్‌లోనూ సమస్య ఉత్పన్నం కాకుండా విద్యుత్ శాఖాధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టడంతో రైతుల్లో ఆనందం నెలకొంది.

కొలిమిగుండ్ల: వ్యవసాయానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. నాలుగేళ్లలో ఎవరూ ఊహించని విధంగా రైతన్నకు అండగా నిలిచేలా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. ఆర్‌బీకేలు మొదలు అగ్రిల్యాబ్‌లు, ఆధునిక యంత్రాలు.. ఇలా ఎన్నో అందుబాటులో ఉంచింది. బోరుబావు రైతులు ఎదుర్కొనే విద్యుత్ సమస్యను సైతం పరిష్కరించింది. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌తో పాటు పగలే 9 గంటలు నిరంతరంగా సరఫరా చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,21,558 లక్షల వ్యవసాయ సర్వీసులు ఉన్నాయి. 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లు 122 ఉన్నాయి. మొత్తం 350 ఫీడర్లు ఉండగా వీటిలో 332 ఫీడర్ల నుంచి పగలు 9 గంటల విద్యుత్ సరఫరా జరుగుతోంది. 8 ఫీడర్ల పరిధిలోని రైతుల విన్నపం మేరకు వారు కోరుకున్న సమయంలో సరఫరా చేస్తున్నారు. మరో 10 ఫీడర్ల నుంచి సరఫరా జరగడం లేదు. 45,340 త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని విభాగాలకు ప్రతి రోజు 207 మెగావాట్ల విద్యుత్ ఖర్చు అవుతుండగా వ్యవసాయానికే అత్యధికంగా 160 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నారు.

30 రోజుల్లోనే కొత్త కనెక్షన్..

విద్యుత్ కనెక్షన్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోనే మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం 25, 16 కేవీ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తోంది. 2021 మార్చి 31 వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అధికారులు పరిశీలించి ఒకే సారి జిల్లా వ్యాప్తంగా 3,676 సర్వీసులు మంజూరు చేశారు. ఈ కనెక్షన్‌లు పొందిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, మిగిలిన సామగ్రి అందజేశారు. సామగ్రి కోసం ప్రభుత్వం రూ.31.44 కోట్లు ఖర్చు చేసింది.

అందుబాటులోకి హైఓల్టేజీ డిస్ట్రిబ్యూషన్ సిస్టం

గతంలో లో ఓల్టేజీ సమస్యతో మోటర్లు, పంప్‌లు కాలిపోయి చాలా ఇబ్బందులు పడేవాళ్లు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హైఓల్టేజీ డిస్ట్రిబ్యూషన్ సిస్టం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ విధానంతో విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ వరకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుంది. నాలుగేళ్ల వ్యవధిలో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సబ్‌స్టేషన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఓవర్ లోడ్ లేకుండా కెపాసిటీ పెంచుకుంటూ పోయారు.

గతంలో అస్తవ్యస్తం..

టీడీపీ పాలనలో వ్యవసాయం రంగం అస్తవ్యస్తంగా ఉండేది. సమయ పాలన లేని విద్యుత్ కారణంగా రైతులు నరకయాతన అనుభవించారు. అర్ధరాత్రి 12 గంటలకు, తెల్లవారు జామున 3 గంటల సమయంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడంతో రైతులు నిద్రలేని రాత్రులు గడిపారు. పొలాల వద్ద పంటలకు నీళ్లు పారించేందుకు విద్యుత్ కోసం నిరీక్షించే వారు. సక్రమంగా విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోయిన సంఘటనలు ఉన్నాయి. రాత్రిళ్లు పొలాల వద్ద రైతులు విషసర్పాల బారిన పడి మృతి చెందారు.

రైతుల హామీ నెరవేర్చి..

వ్యవసాయానికి పగలు 9 గంటల కరెంట్ ఇవ్వడంతో బోరు బావుల కింద రైతులు బంగారు పంటలు పండించుకుంటున్నారు. వరి, మిరప, వేరుశనగ, పసుపు తదితర వాణిజ్య పంటలతో పాటు ఉద్యాన పంటలు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 2004లో సీఎం వైఎస్సార్ వ్యవసాయ బోర్లకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తూ తొలి సంతకం చేసి రైతులను ఆదుకున్నారు. అప్పటి నుంచి రైతాంగానికి విద్యుత్ బిల్లుల బాధ తప్పింది. మహానేత ఆశయం పూర్తి స్థాయిలో నెరవేరాలనే సంకల్పంతో ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ప్రజా సంకల్ప యాత్రలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఖర్చుకు వెనుకాడకుండా వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తూ రైతుల పక్షపాతిగా ముఖ్యమంత్రి నిలిచారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడా అంతరాయం ఏర్పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యుత్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఫీడర్ల ఆధునికీకరణ, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏకదాటిగా 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తుండటంతో వేలాది మందికి రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.



బోర్ల కింద కళకళలాడుతున్న వరి పంట



చింతలాయిపల్లె సబ్‌స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసిన దృశ్యం

అడవి జంతువుల దాడిలోనూ గాయపడటం, మృత్యువాత పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. అప్పట్లో బోరుబావుల రైతులు దినదిన గండంగా వ్యవసాయం చేయాల్సిన పరిస్థితులు ఉండేవి. పంటలు సరిగా పండక పోయినా, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటలు దెబ్బతిన్నా రైతులు ఆర్థికంగా చితికిపోయి విద్యుత్ బిల్లులు చెల్లించలేక అవస్థలు పడేవారు.

కూలీల ఖర్చు తగ్గింది



వ్యవసాయానికి పగలు 9గంటల విద్యుత్ సరఫరా ఇవ్వడం చాలా మంచి నిర్ణయం. రైతులు వారి వారి అవసరాలు బట్టి పంటలకు నీళ్లు వదులుకునే అవకాశం ఉంది. పగలు కరెంట్ వల్ల విద్యుత్ ప్రమాదాలకు ఆస్కారం చాలా తక్కువ. గతంలో వ్యవసాయానికి రాత్రి వేళ విద్యుత్ సరఫరా అవుతుండగా నీళ్లు కట్టేందుకు కూలీలు అధికంగా అడిగేవారు. ఇప్పుడు కూలీల ఖర్చు కొంచెం తగ్గింది.

– మోహన్‌రెడ్డి, రైతు, కోటపాడు

లోఓల్టేజీ అసలు లేదు



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో లో ఓల్టేజీ సమస్య పరిష్కారమైంది. గతంలో లోఓల్టేజీ ఈ కారణంగా మోటార్లు కాలిపోయి ఇబ్బందులు పడుతుండేవాళ్లం. ఇప్పుడు కావాల్సినంత కరెంట్ ఉంటుంది. సరఫరాలో కూడా ఇబ్బందులు లేవు. ఎలాంటి టెన్షన్ లేకుండా పగలే నీళ్లు వదులుకుంటున్నాం.

– రంగయ్య, కమ్మవారిపల్లె, రైతు

విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేవు



రైతులకు పగటి పూట ఇస్తున్న 9 గంటల విద్యుత్ సరఫరాలో ఎక్కడా ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు తీసుకున్నాం. విద్యుత్ సబ్‌స్టేషన్లలో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. ఓవర్ లోడ్ లేకుండా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చాం. కొన్ని చోట్ల బోర్లలో నీళ్లు తక్కువగా ఉన్నాయని మోటార్లు కాలిపోతాయని రైతులు మా దృష్టికి తీసుకురావడంతో వారి సౌలభ్యం మేరకు 9 గంటల స్థానంలో తెల్లవారు జామున విద్యుత్ సరఫరా అందించేలా చూస్తున్నాం. వ్యవసాయానికి అన్ని ఫీడర్ల నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. – రమణారెడ్డి, ఈఈ, నంద్యాల

సచివాలయాల్లో 'స్పందన' మెరుగుపడాలి

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ప్రజల నుంచి వచ్చే వినతులను మరింత మెరుగ్గా పరిష్కరించేందుకు సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో వినూత్న రీతిలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి తమ సమస్యల పరిష్కార నిమిత్తం స్పందన కార్యక్రమానికి వస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వేగంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు సచివాలయంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన గ్రీవెన్స్ తీసుకొని, రెండు అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించి సంబంధిత నోట్ ఫొటోలను స్పందన గ్రూపులో అప్‌లోడ్ చేయాలన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

స్పందన వినతులను ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన పనులు గ్రౌండ్‌లోకి తెచ్చేందుకు కాంట్రాక్టర్లను ప్రోత్సహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆయుష్మాన్ భారత్ సర్వే, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 161 వినతులు రాగా, వీటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రమాణస్వీకారం



ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన డాక్టర్ మధుసూదన్ సోమవారం వెలగపూడి శాసనసభ భవన ప్రాంగణంలో ప్రమాణం చేస్తున్న దృశ్యం

మద్యం మత్తులో కేఈ కుమారుడి హల్‌చల్

ఇన్నోవాతో నాలుగు బైకులు, ఆటోను ఢీకొట్టిన వైనం

- సుంకేసుల రోడ్డులో వాహనదారులు బెంబేలు
- మందుబాబుకు దేహశుద్ధి చేసిన స్థానికులు
- ఘటనా స్థలానికి చేరుకుని సర్దిచెప్పిన మాజీమంత్రి

కర్నూలు: టీడీపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి సోదరుని కుమారుడు మద్యం మత్తులో సుంకేసుల రోడ్డులో హల్‌చల్ సృష్టించాడు. కార్తీక్ హాస్పిటల్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనతో వాహనదారులు బెంబేలెత్తారు. ఇన్నోవా వాహనంలో హైదరాబాద్ జాతీయ రహదారి వైపు వెళ్తూ కార్తీక్ హాస్పిటల్ సమీపంలో వరుసగా 4 బైకులు, ఒక ఆటోను ఢీకొట్టాడు. అప్పటికీ వాహనం అదుపు కాక డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. కర్నూలు మండలం పంచలింగాల గ్రామానికి చెందిన తిరుమలేష్ కర్నూలులో కిరాణం సరుకులు తీసుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా వెనుకవైపు నుంచి ఇన్నోవా వాహనంతో ఢీకొట్టాడు. దీంతో అతను కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. తిరుమలేష్ వెన్నెముక విరిగిపోవడమే కాక వీపు, తలకు గాయాలయ్యాయి. అలాగే ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన బెస్త నాగరాజు కూడా అదే మార్గంలో వెళ్తుండగా ఇన్నోవా వాహనంతో ఢీకొట్టడంతో గాయాలకు గురయ్యాడు. ఈయన టీజీవీ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు. అలాగే పుల్లారెడ్డి కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం(మెకానికల్) చదువుతున్న రాజేష్ కూడా ఇదే మార్గంలో ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. ఇక బాలాజీ నగర్‌కు చెందిన షాషావలికి కూడా ఈ ప్రమాదంలో గాయాలయ్యాయి. వెనుక నుంచి ఆటోను ఢీకొట్టగా ఆటో ముందున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో సెకండ్ల వ్యవధితో వరుసగా మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో ప్రమాదానికి గురయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న వాహనదారులంతా మద్యం మత్తులో ఉన్న కేఈ తనయుడిని కారులో నుంచి బయటకు లాగి దేహశుద్ధి చేశారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్‌కు స్వయాన అన్న కుమారుడు కావడంతో విషయం తెలుసుకుని వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బాధితులందరినీ వేర్వేరు వాహనాల్లో ఆసుపత్రిలో చేర్పించి చికిత్సలు చేయించారు. పోలీసులు అక్కడికి చేరుకోక ముందే మద్యం మత్తులో ఉన్న అతడిని అక్కడినుంచి తప్పించారు. అయితే బాధితులు డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో బ్లూ కోల్ట్స్ సిబ్బందితో పాటు ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఘటనకు కారణమైన ఇన్నోవా వాహనం డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా ఉండటంతో రికవరీ వాహనం సహాయంతో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ప్రమాదంలో ఇన్నోవా వాహనం ముందు భాగం నుజ్జునుజ్జయింది. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆదేశాల మేరకు ఎస్ఐ గిరిబాబు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరుపై సీసీ ఫుటేజీ సేకరించారు. అయితే ఇంతవరకు బాధితులెవరూ ఫిర్యాదు చేయలేదని డీఎస్పీ తెలిపారు.



ప్రమాదంలో ముందుభాగం తీవ్రంగా దెబ్బతిన్న ఇన్నోవా వాహనం

భూ కేటుగాళ్లకు 14 రోజుల రిమాండ్

బొమ్మలసత్రం: నకిలీ పత్రాలతో భూమిని రిజిస్టర్ చేసుకున్న కేసులో 8 మందికి నంద్యాల కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు డీఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. నకిలీ డెత్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో స్థానిక ఉదయానంద ఆసుపత్రి వెనుక ఉన్న 50 సెంట్ల స్థలాన్ని కబ్జా చేశారు. ఈ కేసులో చవ్వా పవన్, తిరుమల్, మౌలాలి, ఖాసిమ్, డాక్యుమెంట్ రైటర్లు సుమంత్, అస్లామ్, దాదాపీర్, నబిరసూల్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ఏపీ ఈఏపీ సెట్‌కు 93.98 శాతం హాజరు

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్-ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్‌కు సోమవారం 93.98 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. కర్నూలు నగరంలో 7 కేంద్రాలు, ఎమ్మిగనూరులో ఒక కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం సెషన్‌కు 1,047 మందికిగాను 981 మంది, మధ్యాహ్నం సెషన్‌కు1,046 మందికిగాను 986 మంది హాజరయ్యారు. నంద్యాల జిల్లాలో నాలుగు కేంద్రాల్లో ఉదయం సెషన్‌కు 483 మందికి గాను 449 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 483 మందికి గాను 457 మంది విద్యార్థులు హాజరయ్యారు.

వేరుశనగలో నాణ్యతకు భరోసా

ప్రత్యేక అధికారులతో తనిఖీలు

- ఈ సారి 15,905 క్వింటాళ్ల వేరుశనగ కేటాయింపు
- బహిరంగ మార్కెట్‌లో క్వింటా వేరుశనగ ధర రూ.7,500 పైనే
- ప్రభుత్వం నిర్ణయించిన సబ్సిడీ ధర రూ.5,580
- నంద్యాల జిల్లాకు 3,550 క్వింటాళ్ల కేటాయింపు
- ఆర్‌బీకేల వారీగా వేరుశనగ సిద్ధం చేస్తున్న ఏపీ సీడ్స్
- ఈ నెల 25 నుంచి పంపిణీకి వ్యవసాయ శాఖ కసరత్తు



ఆర్‌బీకేలకు తరలుతున్న వేరుశనగ విత్తన కాయల ప్యాకెట్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు నాణ్యమైన విత్తనం అందించేందుకు వ్యవసాయ శాఖతో పాటు ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీసీడ్స్) ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ సారి ముందస్తు వర్షాలు కురిశాయి. రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. ఖరీఫ్‌లో సాగు చేసే పంటల్లో వేరుశనగ ముఖ్యమైనది. జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. సకాలంలో రైతన్నలకు విత్తనం అందించాలనే లక్ష్యంతో ఏపీసీడ్స్ ఆర్‌బీకేల వారీగా ముందస్తుగానే వేరుశనగ విత్తన కాయలను అందుబాటులోకి తెస్తోంది. ఏపీ సీడ్స్‌కు సరఫరా చేసే వేరుశనగ కర్నూలు, కల్లూరు మండలాల్లోని ఆరు యూనిట్లలో ముమ్మరంగా ప్రాసెసింగ్ జరుగుతోంది. ఈ ప్రక్రియను మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు, ఏపీ సీడ్స్ మేనేజర్ శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు. ప్రయోగశాలల్లో నాణ్యతను నిర్ధారించిన వేరుశనగను రైతులకు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. కర్నూలులోని ఏపీ సీడ్స్ నుంచే నంద్యాల జిల్లాకు కూడా విత్తనాలు సరఫరా అవుతాయి. ఈ నెల 25 నుంచి సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ఉంది. ఇందుకు అనుగుణంగా ఏపీసీడ్స్ ముందుస్తుగా రైతుభరోసా కేంద్రాల్లో వేరుశనగను రైతులకు అందుబాటులోకి తెస్తోంది. ఈ ప్రక్రియ ఆదివారం నుంచే మొదలైంది.

గత ఏడాది పంపిణీకి మించి..

2022 ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాకు 16,300 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించగా.. 12,547.50 క్వింటాళ్లు మాత్రమే పంపిణీ అయింది. నంద్యాల జిల్లాకు 4,700 క్వింటాళ్లు కేటాయించగా.. 3,559 క్వింటాళ్లు పంపిణీ అయింది. గత ఏడాది పంపిణీ అయిన వేరుశనగకు అనుగుణంగా కర్నూలు జిల్లాకు ఈ ఖరీఫ్‌లో 15,905 క్వింటాళ్లు కేటాయించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా 2022-23 రబీలోనూ ప్రభుత్వం సబ్సిడీపై వేరుశనగ పంపిణీ చేసింది. మొదటి సారి 40 శాతం సబ్సిడీపై 4,830 క్వింటాళ్లు పంపిణీ చేయడం విశేషం. ఖరీఫ్‌లో వేరుశనగ సాగు తగ్గుతుండగా.. రబీలో పెరుగుతోంది. అందువల్ల రబీలోనూ 40 శాతం సబ్సిడీపై వేరుశనగ పంపిణీ అయింది. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో మాత్రమే వేరుశనగ సాగవుతోంది. కర్నూలు జిల్లాలో పత్తికొండ సబ్ డివిజన్‌లోనే అత్యధికంగా వేరుశనగ సాగు అవుతోంది. అందువల్ల ఈ సబ్ డివిజన్‌కు 10,850 క్వింటాళ్లు కేటాయించడం విశేషం. నంద్యాల జిల్లాకు 3,550 క్వింటాళ్లు కేటాయించారు.



నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

40 శాతం రాయితీపై..

జిల్లాకు కే-6 రకాన్ని కేటాయించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న వేరుశనగ విత్తన కాయలకు 40 శాతం సబ్సిడీ ఇస్తోంది. కిలో పూర్తి ధర రూ.93గా నిర్ణయించారు. రైతులు రూ.55.80 చెల్లించాల్సి ఉంది. ఏపీ సీడ్స్‌కు కంపెనీలే ప్రాసెసింగ్ చేసి, 30 కిలోల బ్యాగులు సిద్ధం చేసి ఆర్‌బీకేల వారీగా సరఫరా చేయాల్సి ఉంది.

నాణ్యత విషయంలో రాజీ ప్రసక్తే లేదు

ఆర్‌బీకేల వారీగా వేరుశనగ విత్తన కాయలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నాం. వ్యవసాయ శాఖ ఈ నెల 25 నుంచి వేరుశనగ పంపిణీ చేయాలనే లక్ష్యంతో ఉంది. ప్రయోగశాలల్లో నాణ్యతను ధ్రువీకరించిన తర్వాతనే ఆర్‌బీకేలకు పంపుతున్నాం. ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద వ్యవసాయ అధికారులు ప్రత్యేకంగా నాణ్యతను పరిశీలిస్తున్నారు.

– శ్రీనివాసరావు, మేనేజర్, ఏపీసీడ్స్, కర్నూలు, నంద్యాల

కుటుంబకలహాలతో బలవన్మరణం


ఆత్మహత్య చేసుకున్న మల్లికార్జున

ఆదోని అర్బన్: కుటుంబ కలహాలతో ఆదోని పట్టణం క్రాంతినగర్‌కు చెందిన మల్లికార్జున(36) పురుగుమందు తాగి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయనకు భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన బంధువులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. అయితే మార్గమధ్యలో మల్లికార్జున మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆదోని టూటౌన్ పోలీసులు తెలిపారు.

‘స్పందన’కు వచ్చే తీరిక లేదా?

- సూపరింటెండెంట్లపై కలెక్టర్ ఆగ్రహం


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు స్పందన కార్యక్రమానికి రాకపోవడంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఈ, ఏ సూరింటెండెంట్లు మాత్రమే వచ్చారని, మిగిలిన వారు ఎందుకు రాలేదని డీఆర్వోను ప్రశ్నించారు. కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులకు సెలవులు కావాలి తప్ప పని చేయడంలేదని మండిపడ్డారు. అర్జీలకు పరిష్కారం చూపకుండా ప్రజలను పదేపదే కార్యాలయానికి తిప్పుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల్లో ఏ సూరింటెండెంట్ దగ్గర ఎన్ని ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయో పరిశీలిస్తానని చెప్పారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జేసీ ఎస్.మౌర్య, సీపీఓ అప్పలకొండ, డీఆర్‌డీఏ పీడీ ఎం.వెంకటసుబయ్య, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సృజన మాట్లాడుతూ..జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలన్నారు. సచివాలయాల్లో ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం కోసం అధికారులు వెబ్‌సైట్ ద్వారా లాగిన్ అయి సరైన ఎండార్స్‌మెంట్ ఇచ్చేలా చూడాలన్నారు. సచివాలయాల ద్వారా స్పందన సమస్యలు పరిష్కారం కావడంలేదని, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు దృష్టి సారించాలన్నారు. నిర్దేశిత గడువులోపు సమస్యను పరిష్కరిస్తే అర్జీ రీ ఓపెన్ కాదన్నారు.

సూక్ష్మ సేద్యానికి ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్లు

కర్నూలు(అగ్రికల్చర్): 2023-24 సంవత్సరానికి సంబంధించి సూక్ష్మ సేద్యానికి రైతుభరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. ఈ ఏడాది 5వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కల్పించేలా ప్రభుత్వం జిల్లాకు లక్ష్యాన్ని కేటాయించింది. 2022-23 సంవత్సరంలో 3,700 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కల్పించాలనేది లక్ష్యం కాగా.. 4,509.04 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కల్పించడం విశేషం. డ్రిప్, స్ప్రింక్లర్ల విలువ రూ.44.52 కోట్లు ఉండగా.. ప్రభుత్వం రూ.36.15 కోట్ల సబ్సిడీ భరించింది. 2022-23లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఈ ఏడాది మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 331 మంది రైతులు 352 ఎకరాల్లో సూక్ష్మ సేద్యానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

ఖరీఫ్‌లో 130 వైఎస్ఆర్ పొలంబడులు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలకు సంబంధించి డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడుల నిర్వహణకు వ్యవసాయ శాఖ ఆదేశాలు ఇచ్చింది. జిల్లాలో 466 రైతుభరోసా కేంద్రాలు ఉండగా... 130 పొలంబడులు నిర్వహించే విధంగా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది. పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, పప్పుదినుసుల పంటలు, చిరుధాన్యాల పంటల్లో పొలంబడులు నిర్వహిస్తారు. రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ఈ బాధ్యత అప్పగించారు. పత్తిలో 65, మొక్కజొన్నలో 9, వేరుశనగలో 35, పప్పుధాన్యాల(పల్సెస్) పంటలకు సంబంధించి 9, మిల్లెట్స్‌లో 12 ప్రకారం పొలంబడులు నిర్వహించనున్నారు.

హజ్ యాత్రికులు డబ్బు చెల్లించేందుకు గడువు పెంపు

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ యాత్రికులు నగదు చెల్లించేందుకు గడువు పెంచుతున్నట్లు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మొహమ్మద్ యాకూబ్ షేఖా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడుతలో రూ.81,800 చెల్లించి ఎంపికైన వారు రెండో విడుతలో రూ.1,70,000 చెల్లించారని.. అయితే మూడు విడుత డబ్బు చెల్లించేందుకు 15వ తేదీతో ముగిసిన గడువును 18కి పెంచినట్లు పేర్కొన్నారు. విజయవాడ నుంచి వెళ్లే యాత్రికులు రూ.1,36,780, హైదరాబాద్ నుంచి వెళ్లే యాత్రికులు రూ.53,373 గురువారంలోపు చెల్లించాలని సూచించారు.

ఉద్యోగం పేరుతో మోసం చేశారు!

- స్పందనలో ఎస్పీకి బాధితుల ఫిర్యాదు



స్పందనలో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: ఫుడ్ కార్పొరేషన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని నందవరానికి చెందిన కర్రెన్న, ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో సూపర్‌వైజర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒక మహిళ డబ్బులు తీసుకుని మోసం చేసిందని మంత్రాలయం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన రాజు .. ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 66 ఫిర్యాదులు స్పందనకు వచ్చాయి.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- కొద్ది రోజులుగా భర్త కనిపించడం లేదని, ఆచూకీ కనుగొని అప్పజెప్పాలని కర్నూలు మండలం నూతనపల్లె గ్రామానికి చెందిన వరలక్ష్మి ఫిర్యాదు చేశారు.
- అదనపు కట్నం కోసం అత్త, మరిది వేధిస్తున్నారని కర్నూలుకు చెందిన జె.రేఖా దేవి ఫిర్యాదు చేశారు.
- అమ్మా నాన్న చనిపోవడంతో అద్దెకు ఉన్న వ్యక్తి మా ఇంటిని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నాడని కర్నూలు అరోరా నగర్‌కు చెందిన గౌసియా ఫిర్యాదు చేశారు.
- తనపై దాడి చేసి గాయపరిచినవారిపై చర్యలు తీసుకోవాలని దేవనకొండ మండలం తెర్నకల్ గ్రామానికి చెందిన ముగతాలి సుధాకర్ ఫిర్యాదు చేశారు.
- స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టపరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ నాగభూషణం, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు కూడా స్పందనలో పాల్గొన్నారు.

బోటు ప్రమాదంలో గల్లంతైన యువతి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న దృశ్యం

అవుకు: అవుకు రిజర్వాయర్‌లో ఆదివారం జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన యువతి విగతజీవిగా కనిపించింది. సరదాగా కుటుంబ సభ్యులతో బోటులో విహరిస్తుండగా తిరగబడిన ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడగా, ఒకరు గల్లంతైన విషయం తెలిసిందే. కాగా గల్లంతైన కోవెలకుంట్లకు చెందిన సాజిదా(20) కోసం పోలీసులు గజఈతగాళ్ల సహాయంతో గాలించగా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం ఉదయం ప్రత్యేక బృందం 9.30 గంటల సమయంలో గాలిస్తుండగా రిజర్వాయర్‌లో ఘటన జరిగిన ప్రదేశానికి కొద్దిదూరంలో సాజిదా మృతదేహం తేలడంతో బయటకు తీసుకువచ్చారు. కుమార్తె మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు మహేశ్వరి, రసూల్ బాషా శోకసంద్రంలో మునిగిపోయారు. ఇటీవల జరిగిన నీట్ ఫలితాల్లో మంచి మార్కులు వచ్చాయని, ఎంబీబీఎస్ సీటు వచ్చి కుటుంబానికి పేరు తెస్తుందని అనుకుంటున్న తరుణంలో కుమార్తె దూరమైందని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి


మాట్లాడుతున్న యాదగిరి

కర్నూలు కల్చరల్: ఉజ్వల భవిష్యత్తుకు యువత బాటలు వేసుకోవాలని హైదరాబాద్ ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషినల్ కమీషనర్ బి.యాదగిరి అన్నారు. కర్నూలు రెవెన్యూ కాలనీలోని రవీంద్ర పాఠశాలలో గ్రూప్, సివిల్స్ ప్రిపరేషన్ గైడెన్స్‌కు సంబంధించిన ఉచిత శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి పినాక సొసైటీ, పీపుల్స్ ఎంపవర్‌మెంట్, ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీ వరకు 21 రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. శిక్షణకు హాజరయ్యేవారికి ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. నిపుణులైన ఫ్యాకల్టీతో తరగతులు నిర్వహించడంతో పాట, ఉచితంగా మెటీరియల్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరువ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, ఎం.కె.రంగస్వామి, ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షులు బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంఐపీలో ప్రత్యేక శిక్షణతో ఫిట్టర్ల నియామకం

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీఎంఐపీలో ప్రత్యేక శిక్షణతో ఫిట్టర్ల నియామకం చేపడుతున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సూక్ష్మ సాగునీటి సాగుకు సంబంధించి ఎంఐ ఇంజనీర్లు రూపొందించిన నమూనా ప్రకారం రైతుల పొలాల్లో పరికరాలను అమర్చేందుకు ఫిట్టర్స్ అవసరమన్నారు. అనుభవం ఉన్న ఫిట్టర్స్ జిల్లాలో కంపెనీల తరపున పనిచేసేందుకు లేదా వ్యక్తిగతంగా రైతులకు సేవలు అందించడం ద్వారా దినసరి ఆదాయం పొందవచ్చన్నారు. 18 ఏళ్లు పైబడి ఏడో తరగతి ఆపైన చదివిన నిరుద్యోగ యువతకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 08518-279724 లేదా 7995078264 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

క్లుప్తంగా

డిప్యూటీ తహసీల్దార్ ఆత్మహత్య


యల్లప్ప మృతదేహం

కర్నూలు: డోన్ ఆర్డీవో ఆఫీస్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న టి.యల్లప్ప(61) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన కర్నూలులోని బి.క్యాంప్‌లో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా కిడ్నీ జబ్బుతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఈనెల 10వ తేదీ రాత్రి తాను నివాసముంటున్న క్వార్టర్స్‌లో పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ కోలుకోలేక ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈయనకు భార్య లక్ష్మీదేవితో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ శాఖ సీఎండీ కర్నూలు రాక

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు మంగళవారం కర్నూలుకు రానున్నారు. ఈ నెల 17వ తేదీన స్థానిక విద్యుత్ భవన్‌లో జరిగే నెలవారీ విద్యుత్ సమీక్షకు హాజరు కానున్నారు. మరుసటి రోజు ఉదయం 10గంటలకు కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యుత్ ఎస్ఈలు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏడీఈలు, ఏఈలతో సమీక్ష జరుపనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి తెలిపారు.

ఎంటీఎస్ టీచర్లకు శిక్షణ

కర్నూలు సిటీ: కనీస వేతనాలతో పని చేస్తున్న 1998, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు వృత్యంత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ డా.వి రంగారెడ్డి, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ వసుంధరాదేవి పాల్గొని ప్రసంగించారు. మినిమం టైం స్కేల్(ఎంటీఎస్)తో పని చేస్తున్న ఉపాధ్యాయులు బోధన చేసే సమయంలో పాటించాల్సిన నియమాకాలు, పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. శిక్షణలో మొత్తం 265 మంది టీచర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఎస్‌సీఈఆర్‌టీ ఆచార్యులు శ్రీగిరి బాబు, ట్రైనర్స్ పాల్గొన్నారు.

కర్నూలులో జాతీయస్థాయి నాటికల పోటీలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: పీఎంకేఎం, వైఎస్సార్ కళాపరిషత్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17, 18, 19 తేదీల్లో కర్నూలులో జాతీయస్థాయి నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్ర అధ్యక్షులు పత్తి ఓబులయ్య వెల్లడించారు. సోమవారం సీక్యాంప్‌లో కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఎంకేఎం వ్యవస్థాపక అధ్యక్షులు పసుపులేటి వెంకటరమణ సారథ్యంలో పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6.30 గంటలకు నాటికల ప్రదర్శన ప్రారంభం అవుతుందన్నారు. కళాభిమానులు అందరూ పాల్గొన వచ్చని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కళాక్షేత్రం సభ్యులు బాలవెంకటేశ్వర్లు, గాండ్ల లక్ష్మన్న, గోపిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటల్‌కు రూ.లలో)

పంట	కనిష్ఠం	గరిష్ఠం
వేరుశెనగ	4,900	7,339
పొద్దుతిరుగుడు	3,089	4,429
ఆముదం	5,106	5,339
వాము	9,069	23,559
ఎండు మిర్చి	6,060	30,299
శనగలు	4,460	4,530
కందులు	3,000	8,105
మొక్కజొన్న	1,439	1,806

విధుల్లో లేని డాక్టర్లపై కఠిన చర్యలు

- ఇకపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం
- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): ఇకపై డ్యూటీ సమయంలో ఆసుపత్రి, కళాశాలల్లో విధుల్లో లేని డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. ఇక నుంచి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో వివిధ విభాగాల హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో వారు సమావేశం నిర్వహించారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన అడ్మినిస్ట్రేటర్స్ ట్రైనింగ్‌లో పేర్కొన్న అంశాలపై చర్చించారు. బోధనాసుపత్రుల్లో పనిచేసే వైద్యులకు అవసరమైన పరికరాలు, వసతులు, సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. వైద్యులకు పదోన్నతులు కల్పించిందని, పరస్పర బదిలీలు చేసిందని, కార్పొరేట్‌కు దీటుగా వేతనాలు చెల్లిస్తోందని, అయినా పనితీరులో మార్పు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇప్పటికీ 40 శాతం మంది వైద్యులు డ్యూటీ సమయంలో ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం ప్రభుత్వం ఇంటలిజెన్స్, విజిలెన్స్ వ్యవస్థల ద్వారా సేకరించిందన్నారు. కొందరు వైద్యులు ఫేస్ రికగ్నేషన్ యాప్ ద్వారా హాజరును గేటు బయట నుంచే వేసి అటే వెళ్లిపోతున్నారని ఆన్‌లైన్‌లో రికార్డు అవుతున్నట్లు తెలిపారు. ఇందులో అధికారుల సమన్వయలోపం కూడా ఉన్నట్లు ఉన్నతాధికారులు భావిస్తున్నారని చెప్పారు. చాలా మంది రోగులు ఉన్నా వైద్యులు ఓపీ 12 గంటలకంతా బంద్ చేసి వెళ్లిపోతున్నారని, వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకుని వచ్చిన రోగులకు వైద్యులు కనిపించడం లేదన్నారు. అవసరమైతే సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు ఓపీలో ఉండాలని ఆదేశించారు. ఇకపై నెలవారీ ఎఫ్ఆర్ఎస్‌ను సమీక్షిస్తామని, ఎవరు ఎప్పుడు ఎక్కడ నుంచి హాజరువేశారనే దానిని బట్టి వారి జీతభత్యాలు మంజూరవుతాయన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ హరిచరణ్ పాల్గొన్నారు.